రాష్ట్రంలో మాదకద్రవ్యాలు కనపడొద్దు

- ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- మోర్తాడ్, భీమ్‌గల్, ఆర్మూర్‌లో ఎక్సైజ్ భవనాల ప్రారంభం

మోర్తాడ్/భీమ్‌గల్/ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్ 30: రాష్ట్రంలో మాదకద్రవ్యాల అడ్రస్ కనిపించకూడదని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మోర్తాడ్, భీమ్‌గల్, ఆర్మూర్‌లో నిర్మించిన ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ భవనాలను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మోర్తాడ్, భీమ్‌గల్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈప్రాంతంలో గంజాయి, డ్రగ్స్ లాంటివి దరిదాపుల్లో లేవని తెలిసిందన్నారు. అంతకు ముందు కలెక్టర్ రాజీవ్‌గాంధీహన్మంతు, జిల్లాఎక్సైజ్ అధికారి మల్లారెడ్డి, ఎక్సైజ్ అధికారులతో సమావేశమై ఈ ప్రాంత పరిస్థితులపై చర్చించారు. కార్యక్రమాల్లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి, సహకార సంఘాల యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, కాంగ్రెస్ పార్టీ బాల్కొండ ఇన్‌చార్జి సునీల్ రెడ్డి, ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, భీమ్‌గల్ మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలతా సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి

సహకార సంఘాల మహాజన సభలో తీర్మానాలు

డిచ్‌పల్లి/ సారంగాపూర్/ఇందల్వాయి/ చందూర్/ రుద్రూర్/నవీపేట/బోధన్ రూరల్/రెంజల్, సెప్టెంబర్ 30 : ఎలాంటి ఆంక్షలూ లేకుండా రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని కోరుతూ జిల్లాలోని పలు సహకార సంఘాల్లో సోమవారం నిర్వహించిన మహాజన సభల్లో తీర్మానించారు. ఖిల్లా డిచ్‌పల్లిలో నిర్వహించిన మహాజనసభలో సొసైటీ చైర్మన్ రాంచందర్‌గౌడ్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. కూలీలను అందుబాటులో ఉంచుతామన్నారు. సహకార సొసైటీ ఆధ్వర్యంలో రైతులందరికీ క్వింటాలు సన్న ధాన్యానికి ప్రభుత్వం రూ. 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఖిల్లా డిచ్‌పల్లి సహకార సొసైటీ వైస్‌చైర్మన్ కుమ్మరి గంగారాం, డైరెక్టర్లు దాసరి రమేశ్, బాలమల్లు, సాయిలు, ఏలేటి సతీశ్‌రెడ్డి, ఎల్ల శ్యాంసన్, సీఈవో కిషన్, సహకార సొసైటీ సిబ్బంది సాయిలు రైతులు పాల్గొన్నారు. నిజామాబాద్ రూరల్ మండలంలోని గుండారం సొసైటీలో చైర్మన్ దాసరి శ్రీధర్ అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. సభలో సన్నరకం ధాన్యంతో పాటు దొడ్డు రకం ధాన్యానికి కూడా బోనస్‌ను అందించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు. చైర్మన్ శ్రీధర్ మాట్లాడుతూ సొసైటీ పరిధిలో 150 మంది రైతులకు రుణమాఫీ వర్తించిందని, ఇంకా 170 మందికి రుణమాఫీ వర్తించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు విన్నవించినట్లు తెలిపారు. సమావేశంలో సహకార క్లస్టర్ ఆఫీసర్ సరస్వతి, సొసైటీ వైస్‌చైర్మన్ సత్యంరెడ్డి, సీఈవో అనంతలక్ష్మి, డైరెక్టర్లు, సిబ్బంది రాములు, లింబారెడ్డి, రైతులు పాల్గొన్నారు. ఇందల్వాయి మండలంలోని నల్లవెల్లి సొసైటీలో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. పభుత్వం రైతులందరికీ సన్నధాన్యానికి బోనస్ ఇస్తుందని, ప్రతి ఒక్కరూ సొసైటీలోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఆంక్షలూ లేకుండా రుణమాఫీ చేయాలని రైతులందరూ తీర్మానించి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ వైస్‌చైర్మన్ చిన్నబోయిన రమేశ్, డైరెక్టర్లు, సహకార సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చందూర్ సహకార సంఘంలో చైర్మన్ ప్యారం అశోక్ అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. రైతులందరికీ రూ. 2 లక్షల రుణమాఫీ వర్తింపజేయాలని తీర్మానించారు. కార్యదర్శి భూమయ్య, సహకార సంఘం మేనేజర్ సుధాకర్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు. రుద్రూర్ సహకార సంఘంలో చైర్మన్ సంజీవ్ రెడ్డి అధ్యక్షతన 89వ మహాజన సభ నిర్వహించారు. ప్రభుత్వం వరికి రూ.500 బోనస్ ఇవ్వాలని తీర్మానించారు. నవీపేట్ మండలం బినోలా సహకార సంఘం మహాజన సభను అధ్యక్షుడు మగ్గరి హన్మాండ్లు అధ్యక్షతన నిర్వహించారు. రూ. 2 లక్షల రుణా మాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

రెంజల్ మండల నీలాలో సహకార సంఘం చైర్మన్ ఇమ్రాన్‌బేగ్ అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. సాలూర మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో విండో మహాజన సభను సొసైటీ చైర్మన్ అల్లె జనార్దర్ అధ్యక్షతన నిర్వహించారు.

గుండారంలో మాట్లాడుతున్న విండో చైర్మన్ దాసరి శ్రీధర్

బినోలాలో మాట్లాడుతున్న చైర్మన్ హన్మాండ్లు

ఎమ్మెల్యే వేముల మాతృమూర్తి మంజులమ్మకు నివాళి

పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కిషన్‌రావు, దాదాన్నగారి విఠల్‌రావు

వేల్పూర్, సెప్టెంబర్ 30: మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మాతృమూర్తి మంజులమ్మ సంవత్సరీకం సోమవారం నిర్వహించారు. పలువురు నాయకులు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, హన్మంత్ సిండే, జాజాల సురేందర్‌తోపాటు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీరాంకిషన్ రావు, దాదన్నగారి విఠల్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లాలోని పలువురు బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

ఇండ్లస్థలాలు చూపించాలి

తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

మోర్తాడ్, సెప్టెంబర్ 30: మోర్తాడ్ మండలం దోన్‌పాల్ గ్రామంలో లబ్ధిదారులకు ఇండ్లస్థలాలు చూపించాలని డిమాండ్ చేస్తూ సీపీఐఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో సోమవారం మోర్తాడ్ తహసీల్ కార్యాలయం ఎదుట లబ్ధిదారులు నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆపార్టీ నాయకులు మాట్లాడుతూ.. దోన్‌పాల్ గ్రామంలో 1994లో సర్వేనంబర్ 222లో ఇందిరమ్మ పథకం కింద 80 ప్లాట్లకు సంబంధించి లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చారని అన్నారు. ఇప్పటి వరకూ వారికి స్థలాలు చూపించలేదని అన్నారు. అనంతరం తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ నాయకుడు అశోక్, దోన్‌పాల్ మాజీ సర్పంచ్ గంగాపోసాని, గంగాధర్, లక్ష్మి, సత్తెమ్మ, లింబాయి, సురేశ్, నాగమణి, జమున, భూమగంగు తదితరులు పాల్గొన్నారు.

సాలూరవాసికి వరల్డ్ స్మిత్ అవార్డు

బోధన్, సెప్టెంబర్ 30: బోధన్ డివిజన్‌లోని సాలూరా మండల కేంద్రానికి చెందిన ఘంటే నగేశ్‌కు వరల్డ్ స్మిత్ అవార్డు లభించింది. ఢిల్లీకి చెందిన ఏషియన్ లిటరరీ సొసైటీ ఈ అవార్డును ప్రకటించింది. నగేశ్ ఈ అవార్డును ఆదివారం ఢిల్లీలో అందుకున్నారు. ఆయన రాసిన 'ప్రిన్సెస్ ఇన్ నేచర్' కవితతోపాటు ఆకాశ మేఘాల నుంచి తీసిన ఫొటోగ్రఫీకి ఈ అవార్డును ఇచ్చారు. నగేశ్ ప్రస్తుతం మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తున్నారు.

ఉపాధిహామీ సోషల్ ఆడిట్

ఏర్గట్ల, సెప్టెంబర్ 30: మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు అధ్యక్షతన సోమవారం సోషల్ ఆడిట్ కో-ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. 2023-24 సంవత్సంలో మండలంలోని ఎనిమిది గ్రామాల్లో నిర్వహించిన ఉపాధిహామీ పనుల వివరాలు, సాధించిన లక్ష్యాలు, కూలీలకు చెల్లించిన డబ్బుల వివరాలు అధికారులు చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎస్ఆర్పీ, ఏపీవో, డీఆర్పీలు, జీపీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 30 : జిల్లాకేంద్రంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ తోట రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల నేపథ్యంలో న్యూహౌసింగ్ బోర్డు సబ్‌స్టేషన్ పరిధిలోని గంగస్థాన్, కంఠేశ్వర్, న్యూహౌసింగ్ బోర్డు, చంద్రశేఖర్ కాలనీ, బైపాస్ రోడ్డు, ఆర్మూర్ రోడ్డు, విద్యుత్‌నగర్, హోటల్ లహరి ఇంటర్నేషనల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

'చలో హైదరాబాద్'కు తరలిన జీపీ కార్మికులు

జక్రాన్‌పల్లి, సెప్టెంబర్ 30 : మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలం నుంచి పంచాయతీ కార్మికులు తరలివెళ్లినట్లు గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు సోప్పరి గంగాధర్ తెలిపారు. తరలివెళ్లినవారిలో శేఖర్, సాయన్న, రాజన్న, గంగాధర్, సర్వర్ లక్ష్మి, గున్నవ్వ, లక్ష్మణ్ ఉన్నారు.

సంగీత కళాశాలలో కళార్చన

సుభాష్‌నగర్, సెప్టెంబర్ 30: సంగీత నృత్యాలతో ప్రతినెలా కళార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కేంద్రంలోని శ్రీజ్ఞాన సరస్వతి ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల ప్రిన్సిపాల్ రవీందర్ రాజు తెలిపారు. సోమవారం పాఠశాలలో కళార్చన నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. కళార్చనను పాఠశాల విద్యార్థులతో ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్వప్నారాణి, ఎం. అంకిత, జయప్రద పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రతిరోజు దీపారాధన చేయాలి

శక్కర్‌నగర్, సెప్టెంబర్ 30: ప్రతి గ్రామంలోని ఆలయాల్లో నిత్య దీపారాధన చేయాలని చిలుకూరు శివాలయం ప్రధాన అర్చకుడు, నర్సాపూర్ దివ్య సంజీవని హనుమాన్ ఆలయ వ్యవస్థాకుడు రామదాసి సురేశ్ ఆత్మారాం మహరాజ్ అన్నారు. సోమవారం బోధన్ పట్టణ శివారులోని బోధన్- నిజామాబాద్ రహదారి పక్కన ఉన్న శ్రీసంజీవని ఆంజనేయస్వామి ఆలయంలో ఆయన దీపారాధనకు నూనె పంపిణీ చేశారు.

ఖోఖో క్రీడాకారుల ఎంపిక

వేల్పూర్, సెప్టెంబర్ 30: జిల్లాస్థాయి సబ్‌జూనియర్ ఖోఖో టోర్నమెంట్‌లో భాగంగా భీమ్‌గల్ జోనల్ స్థాయిలో ఎంపిక పోటీలు సోమవారం వేల్పూర్‌లో నిర్వహించారు. ఎంఈవో రేణుక, జడ్పీహెచ్ఎస్ వేల్పూర్ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కె.రాజన్న, పీఆర్‌టీయూ వేల్పూర్ మండల అధ్యక్షుడు బి.దేవానందం పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో ఎంతో మేలు

మోర్తాడ్, సెప్టెంబర్ 30: శరీరంలో ప్రధానంగా వచ్చేనొప్పులకు తరుచూ మాత్రలు వాడకుండా ఫిజియోథెరపీ చేయడం ఎంతో మేలని ఎంఈవో సమ్మిరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఫిజియోథెరపీపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిజియోథెరపీ డాక్టర్ రమేశ్ చేతుల నొప్పులు, నడుము నొప్పి, మోకాళ్లనొప్పులు, మైగ్రేన్‌కు సంబంధించి ఫిజియోథెరపీ ఏవిధంగా చేయాలో చూపించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

మోర్తాడ్, సెప్టెంబర్ 30: మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 15 మంది ఉపాధ్యాయులను ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో మండల పరిషత్‌కార్యాలయంలో సోమవారం సన్మానించారు. మోర్తాడ్‌లో ఎంఈవో గా పనిచేసిన ఆంధ్రయ్యను కూడా సన్మానించారు. కార్యక్రమంలో మోర్తాడ్ ఎంఈవో సమ్మిరెడ్డి, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు మగ్గిడి ప్రవీణ్, ప్రధానకార్యదర్శి ప్రగత్‌కుమార్, దండుగంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పాడె మోసిన బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి, సెప్టెంబర్ 30 : మండలంలోని దూస్‌గాం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి అమ్మమ్మ పడిగెల గంగవ్వ (110) మృతి చెందగా.. మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సోమవారం భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియలో పాల్గొని పాడె మోశారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ దాసరి ఇందిరా లక్ష్మీనర్సయ్య, మాజీ మండల అధ్యక్షుడు శక్కరికొండ కృష్ణ, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు పద్మారావు, ఒడ్డెం నర్సయ్య, నయీమ్, మాజీ సర్పంచ్ లింగం యాదవ్, సూదం రాథోడ్, జాకీర్, మురళి, మోహన్, గిరి పటేల్, రవిగౌడ్, కాంతారావు ఉన్నారు.

సిర్పూర్ పాఠశాల విద్యార్థులకు అభినందన

ఖలీల్‌వాడి(మోపాల్), సెప్టెంబర్ 30 : జిల్లా కేంద్రంలో గత శనివారం వివిధ అంశాలపై నిర్వహించిన పోటీల్లో మండలంలోని సిర్పూర్ పాఠశాలకు చెందిన పది, తొమ్మిదో తరగతి విద్యార్థులు ప్రదర్శించిన 'తన దాకా వస్తే' అనే నాటికకు రెండో బహుమతి లభించింది. దీంతో వారిని పాఠశాల గెజిటెడ్ హెచ్ఎం వి.సత్యనారాయణ సోమవారం అభినందించారు. నాటిక రచయిత, తెలుగు ఉపాధ్యాయుడు కాసర్ల నరేశ్‌రావు అభినందనీయులని పేర్కొన్నారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులు అక్షయ, రచన, వరలక్ష్మి, తబస్సుమ్, శ్రీజ, నందిని, మేఘన, హిందుశ్రీకి పుస్తకాలు, సర్టిఫికెట్లను అందించి సన్మానించారు.

ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థినులు

సత్తా చాటిన సుద్దపల్లి గురుకుల విద్యార్థినులు

డిచ్‌పల్లి, సెప్టెంబర్ 30 : డీఎస్ మెమోరియల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించిన సీనియర్ అండర్-19 వాలీబాల్ పోటీల్లో సుద్దపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల (బాలికల) పాఠశాల విద్యార్థినులు సత్తాచాటారు. ద్వితీయ స్థానంలో నిలిచి రూ.5 వేల నగదు బహుమతి అందుకోగా.. ప్రిన్సిపాల్ టి.నళిని, ఉపాధ్యాయ బృందం అభినందించింది.

త్వరలో ముగియనున్న పాలకమండళ్ల గడువు

సుభాష్‌నగర్, సెప్టెంబర్ 30: జిల్లా దేవాదాయ ధర్మదాయశాఖ పరిధిలోని పలు ఆలయాల పాలక మండళ్ల గడువు అక్టోబర్ 5తో ముగియనున్నదని జిల్లా సహాయ కమిషనర్ విజయ రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని శంభు లింగేశ్వరాలయం, జెండా బాలాజీ మందిరం, హమల్‌వాడీ సాయి సంతోషి మాత ఆలయాల పాలక మండళ్ల గడువు ఈనెల 5తో ముగుస్తుందని పేర్కొన్నారు. ఖాళీ అయిన ఉమ్మడి జిల్లాలోని దేవాలయాలకు పాలక మండళ్ల కోసం నోటిఫికేషన్‌ను రాష్ట్ర దేవాదాయ ధర్మదాయశాఖ విడుదల చేయనున్నదని తెలిపారు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్యా యత్నం

చికిత్స పొందుతూ మృతి

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 30: ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్యకు యత్నించాడు. తీవ్ర గాయాలు కావడంతో దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు,పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముబారక్‌నగర్‌లో ఉండే శ్రీహరి(48) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంతకాలం క్రితం అదే కాలనీకి చెందిన ఓ మహిళతో గొడవ జరగడంతో ఆమె ఫిర్యాదు మేరకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో శ్రీహరి పై కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి అతడు కోర్టుకు వెళ్తుండడంతో తీవ్ర మనస్తాపానికి గురై సెప్టెంబర్ 25న ఒంటి పై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబీకులు వెంటనే దవాఖానలో చేర్పించగా.. చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

గర్భిణులకు పండ్లు అందజేస్తున్న ఏసీడీపీవో జ్యోతి, సూపర్‌వైజర్ వెంకట రమణమ్మ

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్30: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ ఏసీడీపీవో జ్యోతి, సూపర్‌వైజర్ వెంకట రమణమ్మ అన్నారు. పోషణ మాసంలో భాగంగా ఆర్మూర్ అర్బన్ సెక్టార్ లెవల్ అవగాహన కార్యక్రమం సోమవారం పట్టణంలో నిర్వహించారు. గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, మెడికల్ ఆఫీసర్ ఫిర్దోస్ ఫాతిమా, సూపర్ వైజర్ నళిని, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మొరం టిప్పర్ పట్టివేత

నవీపేట,సెప్టెంబర్ 30: రెంజల్ మండలం నీల నుంచి ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్‌ను మండల కేంద్రంలో ఎస్సై వినయ్ సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన టిప్పర్‌ను జరిమానా నిమిత్తం తహసీల్దార్ వెంకటరమణకు అప్పగించగా ఆయన రూ. 20 వేల జరిమానా విధించారు.

యువకుడి ఆత్మహత్య

శక్కర్‌నగర్, సెప్టెంబర్ 30: బోధన్ పట్టణం రాకాసీపేట్‌కు చెందిన అల్తాఫ్ (20) తన ఇంట్లో సోమవారం సాయంత్రం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ కథనం మేరకు.. అల్తాఫ్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తుండే వాడు. కొంత కాలంగా మద్యానికి బానిసగా మారి పనికి వెళ్లకుండా జులాయిగా తిరుగుతున్నాడు. మద్యానికి డబ్బులు లభించక ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కోనాసముందర్‌లో విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చౌటపల్లిలో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

విద్యార్థుల విజయోత్సవ ర్యాలీ

మోర్తాడ్, సెప్టెంబర్ 30: కమ్మర్‌పల్లి మినీ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన కమ్మర్‌పల్లి మండల అంతర్ పాఠశాలల క్రీడా పోటీల్లో చౌటపల్లి ఉన్నత పాఠశాల తొమ్మిది షీల్డ్‌లను గెలిచి ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. దీంతో గ్రామంలో సోమవారం క్రీడాకారులు, గ్రామస్తులు విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అభినందరన సభలో హెచ్ఎం ఆంధ్రయ్య, పీఈటీ నాగేశ్, క్రీడాకారులను పాఠశాల అభివృద్ధికమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. కోనాసముందర్ విద్యార్థులు 8షీల్డ్‌లను గెలుచుకుని ద్వితీయస్థానంలో నిలిచారు. గ్రామంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, పీఈటీ సాయన్న, హెచ్ఎం ధన్‌పాల్‌ను గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సాయన్న, ఉపాధ్యక్షుడు రాజగంగారాం, లింబయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

సంక్షిప్తంగా..

.● **సీపీని కలిసిన ఆర్మూర్ ఏసీపీ:** వినాయక్‌నగర్, సెప్టెంబర్ 30: నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్‌ను ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. రెండు రోజుల క్రితం ఆర్మూర్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టగా.. సీపీని కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

● **గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా చూడాలి:** ధర్పల్లి, సెప్టెంబర్ 30: గ్రామాల్లో తాగు, సాగు నీరు సమస్యలు తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో బాలకృష్ణ కార్యదర్శులకు సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు ఈనెల 2 వరకు కొనసాగుతున్న నేపథ్యంలో గామాల్లో షెడ్యూల్ ప్రకారం పనులు చేపట్టాలని పేర్కొన్నారు. తాగునీరు కలుషితం కాకుండా, లీకేజీలు ఏమైనా ఉంటే గుర్తించి వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించారు.

● **చేనేత సహకార సంఘం మహాజన సభ :** రుద్రూర్, సెప్టెంబర్ 30 : మండల కేంద్రంలో 73వ చేనేత సహకార సంఘం మహాజన సభను అధ్యక్షుడు మోత్కూరు నారాయణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. కష్టాల్లో ఉన్న చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఇందుకోసం సంఘం ప్రతినిధులు కృషిచేయాలన్నారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. సంఘం సభ్యులు భూమయ్య , గణేశ్, విజయ్, గంగాధర్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

● **కళాకృతుల ప్రదర్శన** - ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్30: ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల విద్యార్థుల స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా కళాకృతుల ప్రదర్శన సోమవారం నిర్వహించారు. కమిషనర్ రాజు హాజరై మాట్లాడారు. విద్యార్థులు చిన్ననాటి నుంచి కళాకృతులను తయారు చేయడం అభినందనీయం అన్నారు.

● **చెత్తను తొలగించండి:** చందూర్, సెప్టెంబర్ 30: మండలంలోని మేడ్‌పల్లి గ్రామంలో మూడు రోజులుగా పంచాయతీకి చెందిన చెత్తను తరలించే ట్రాక్టర్ రావడంలేదని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. వ్యాధులతో చాలామంది రోగాల బారిన పడ్డారని, సంబంధిత అధికారులు స్పందించి చెత్తతొలగింపు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

● **కొనసాగుతున్న శిక్షణ తరగతులు** - మాక్లూర్, సెప్టెంబర్ 30: మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ తాగునీటి సహాయకులకు శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. 3వ రోజు సోమవారం ఇరిగేషన్ డీఈ గంగారాం సలహాలు, సూచనలు అందజేశారు. ఇరిగేషన్ ఏఈ దివ్యభారతి, మిషన్ భగీరథ ఏఈలు పాల్గొన్నారు.

● **పోలింగ్ కేంద్రాల పరిశీలన:** కోటగిరి, సెప్టెంబర్ 30: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలతోపాటు చావిడిగల్లీ వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ సోమవారం పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన కేంద్రాలను మరో చోటికి మార్చడానికి వివరాలను నమోదు చేసుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట ఆర్ఐ సయ్యద్ ఉన్నారు.

● **ఆరోగ్య సిబ్బందికి సన్మానం:** ధర్పల్లి, సెప్టెంబర్ 30 : మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన ఫార్మాసిస్టు కృష్ణ, పీహెచ్ఎన్ మేరితోపాటు బదిలీపై వెళ్లిన ఆరోగ్య సిబ్బందిని సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్, సూపరింటెండెంట్ డాక్టర్ శివశంకర్, మండల వైద్యాధికారి సుశాంత్‌రెడ్డి, వైద్యులు స్వాతి, మౌనిక, వైద్యసిబ్బంది హరినాథ్ నెహ్రూ, కృష్ణ, నారాయణ, రాజేందర్, నిర్మల, భూలక్ష్మి, మురళి, పద్మ, సంతోష్ పాల్గొన్నారు.

● **మోపాల్‌లో వైద్యశిబిరం:** ఖలీల్‌వాడి(మోపాల్), సెప్టెంబర్ 30 : ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా తెలంగాణ ఆల్ పెన్షనర్స్, సీనియర్ సిటిజన్స్ ఫోరం విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ సహకారంతో మనోరమ దవాఖాన ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శ